


# విపరీతపు విలువలు

మధ్యాహ్నం ఎండ నిప్పులు చెరుగుతోంది. ఆ ఎండలో వేగంగా నడుస్తున్నాడు మాధవరావు. అతనిని మండుటెండ కూడా ఎక్కువ బాధించటం లేదు కాని అంతకంటే ఒక సమస్య అతన్ని ఎక్కువ బాధపెడుతోంది. అదేమిటంటే మాధవరావుకు ఎమ్.బి.బి.ఎస్. చదివిన ఏకైక పుత్రుడు శశికాంత్. అతను మాధవరావు ఫ్రెండు కూతురైన లావణ్యతో స్నేహం చేశాడు. ఆ స్నేహం ప్రణయంగా మారి వాళ్ళు చెట్టాపట్టాలేసుకు తిరగటానికి ఎంతో కాలం పట్టలేదు. దీనికి స్నేహితులిద్దరిలో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు.

ఇంతవరకు బాగానే వుందికాని ఇంత జరిగాక ఇప్పుడు లావణ్యను మేరేజ్ చేసుకోనన్నాడు శశి. ఆ విషయం విని మాధవరావు కొడుకు చెప్పుడు నాలుగు మాటలూ కడిగి పెళ్ళికి ఒప్పిద్దామా అని ఆవేశంగా ఇంటికి వచ్చాడు.

శశి ఈజీ ఛైర్లో కూర్చుని ఏదో బుక్ చదువుకొంటున్నాడు.

"ఏరా. లావణ్యను చేసుకోనన్నావుట. ఏమిటి నిజమేనా" కోపంగా అడిగాడు మాధవరావు.

"నిజమే నాన్నా నేనే చెబుదామనుకున్నాను మీతో."

"ఆ అమ్మాయితో ఇష్టమొచ్చినట్లు తిరిగి ఇప్పుడు చేసుకోనటానికి కారణమేమిటి." "జస్ట్ ఫ్రెండ్లీగా తిరిగామంతే. అంతేగాని నేనేమీ హద్దులు మీరి ప్రవర్తించలేదు. ఇకపోతే మారేజ్ విషయమంటారా. నేను చేసుకుంటానని చెప్పిన మాట నిజమే. కాని ఎప్పుడు? లావణ్య తండ్రి లక్షల ఆస్తికి వారసుడైనప్పుడు. కాని ఇప్పుడలా కాదే. ఆయన బిజినెస్‌లో దెబ్బతిని సర్వం కోల్పోయినవాడు. పైసా కట్నం తేని లావణ్యను చేసుకుని నేనెలా బ్రతగ్గలను. మీరే చెప్పండి నాన్నా."

"అందుకని ఇప్పుడు చేసుకోనంటావా. ఒకవేళ పెళ్ళయిన తరువాత ఆస్తి పోయుంటే ఏం చేసేవాడివి."

"అది వేరే సంగతి. మనకింతే ప్రాప్తం అని సరిపెట్టుకునేవాడిని."

"నీలో ఇంత క్రూరత్వం వుందనుకోలేదు. పెద్దవాడిని నేను కట్నం లేదని అభ్యంతర పెట్టాల్సింది. పోయి చేసుకోనని నువ్వే నిర్ణయం తీసుకుంటావా."

"ఏం చేయమంటారు పూర్వమయితే పిల్లలు ఇంత తెలివిగా ఆలోచించేవారు కాదు. పెద్దలు చెప్పినా వినక లవ్ మారేజస్ ఎక్కువగా చేసుకునేవారు. కాని ఇప్పుడు మా భవిష్యత్తు గురించి ఎక్కువ ఆలోచించుకునే జ్ఞానం మాకుంది."

"నువ్వెన్నయినా చెప్పు. ఇంత జరిగాక ఇలా అంటే ఆ అమ్మాయి బాధపడుతుంది."

"ఆమె బాధపడుతుందని మేరేజ్ చేసుకుని నన్ను బాధపడమంటారా. నా చేత స్వంతంగా డిస్పెన్సరీ తెరిపించగల స్థోమత వున్న అమ్మాయిని చేసుకుంటే నా భవిష్యత్తు బాగుంటుంది."

"నువ్వు నీ సంగతే ఆలోచిస్తున్నావు కాని ఆ అమ్మాయి తరపున కూడా కొంచెం ఆలోచించు."

"నిజమే. కాని నన్నేం చేయమంటారు. ఆమె మాత్రం తక్కువా. నాకు చదువు, అందం అన్నీ వుండబట్టే ఆమె నన్ను ప్రేమించానంది కాని, నా వ్యక్తిత్వం నచ్చి నన్ను ప్రేమించానందంటారా. ఒకవేళ మీరు చెప్పినా నేన్నమ్మను."

"ఏమో. నువ్విలా నాకు నీతులు చెప్తున్నావు. కాని ఆ అమ్మాయి నన్ను నిలబెట్టి నాలుగు మాటలు అంది."

"ఏమందేమిటి" కుతూహలంగా అన్నాడు శశి.

"నువ్వు వచ్చి మోసగాడివట. నీలాంటి వాడిని చేసుకోకపోవడమే మంచిదట.

పకపకా నవ్వాడు శశి.

"చూశారా. ఇప్పటికైనా ఆమె నన్ను నిజంగా ప్రేమించి వుంటే నా ప్రవర్తన గురించి మీతో చెప్పుకుని బాధపడుతుంది. కొన్నాళ్ళ వరకైనా ఆమె మెంటల్‌గా కొంత షాక్ తింటుంది. కాని అదేమి లేదు. ఆమె నన్ను మీ ముందు నాలుగు తిట్టి ఇంకో పెళ్ళికి తయారవుతుందా. సమాజం చాల మారిపోయింది నాన్నా. అమ్మాయిలంతా తమకంటే ఎక్కువ అర్హతలున్నవాడిని చూసి ప్రేమ అనే పేరుతో వలవేస్తున్నారు. మేము మాత్రం తక్కువ తిన్నామా. జస్ట్ స్నేహం అంతే. మారేజ్ దాకా వెళ్ళకుండా జాగ్రత్తపడతాము. అందుకే ఈ కాలంలో ప్రేమ వివాహాలు ఎక్కువగా సఫలమవటం లేదు. వినటానికి అంత బాగుండకపోయినా ఇది మాత్రం పచ్చి నిజం. అయినా నేనిప్పుడు ఆమెని ఏమీ చెయ్యలేదు. వాళ్ళు ఇంకా నా గురించి ఆలోచించటం వ్యర్థం."

"ఏమో. చిన్నప్పట్నుంచి ఎంతో స్నేహంగా వుండే వాళ్ళం. వాడు కూడా నిష్ఠూరంగా మాట్లాడాడు."

"ఎందుకు మాట్లాడడు నాన్నా. తన బిజినెస్ ఎప్పుడో దెబ్బ తిందని తెలిసినా ఆ విషయం బయటికి తెలియనీయక వాళ్ళమ్మాయిని నాతో స్వేచ్ఛగా తిరగనిచ్చాడు. ఇప్పుడు మాత్రం నిందంతా నా మీదే వేస్తున్నారు. బాబూ, కూతుళ్ళు ఇద్దరికిద్దరే" కసిగా అన్నాడు.

"సరే. ఇదంతా ఎందుకు ఆమెని వివాహం చేసుకోనంటావ్. అంతేనా."

"మీరెన్ని చెప్పినా నా నిర్ణయం మారదు నాన్నా. కట్నం అడిగారని మగవాళ్ళని విమర్శిస్తారే కాని, కట్నం ఇవ్వకుండా తక్కువ వాళ్ళని చేసుకుందాం అని ఆలోచించరేం అమ్మాయిలు. కట్నం తీసుకోవటం మంచిదని నేను కోరుకోవటం లేదు. కాని వాళ్ళలా ఆలోచించినప్పుడు మనం మాత్రం కట్నం కావాలని కోరుకోవటంలో తప్పేమిటి. నా మేరేజ్ నేను సెటిల్ చేసుకున్నాను. అమ్మాయి కూడా మెడిసిన్ చదివింది. ఇద్దరి చేతా స్వంతంగా డిస్పెన్సరీ తెరిపించగల స్థోమత మా కాబోయే మామగారికి వుంది. త్వరలో ఆయన మీతో మాట్లాడతానన్నారు" చెప్పుకుపోతున్నాడు శశి.

ఇక వినదల్చుకోలేదు మాధవరావు. ఎంత ఆవేశంగా వెళ్ళాడో, అంత వేగంగా బయటికి వచ్చేశాడు. కొడుకు ప్రవర్తన అతనికి చాల బాధగా అనిపించింది. తనకు చిన్నప్పుడు లవ్ ఎఫైర్ అయిందని శశికి వివాహ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. కాని వాడు ఆ స్వేచ్ఛని దుర్వినియోగం చేసుకున్నాడు. ఏదైనా ఈ రోజులలో అబ్బాయిలైనా, అమ్మాయిలైనా డబ్బుకే విలువ యిస్తున్నారు. డబ్బు మనిషిని అలా ఆడిస్తోంది.

'ఔరా సమాజం ఎంత మారిపోయింది' అనుకున్నాడు నిస్పృహగా.

—కె.కృష్ణకుమారి

## లీలలు

స్విట్జర్లాండ్‌కు చెందిన మోంటిజో చాలాకాలం వివిధ హోటళ్ళలో పనిచేశాడు. అనేక హోటళ్ళ మేనేజర్ల ప్రణయలీలలను అతను ప్రత్యక్షంగా చూశాడు. తర్వాత మేనేజర్ల శృంగారలీలలపై పుస్తకం రాయనున్నట్టు ప్రకటించాడు. అయితే, అతను ఆ పుస్తకాన్ని రాయలేకపోయాడు. ఈ విషయం తెలియగానే వివిధ హోటళ్ళ మేనేజర్లు అతని వద్దకు పరుగెత్తుకొచ్చి కోరినంత డబ్బిచ్చారు. దానితో పుస్తకం రాయాల్సిన అవసరం అతనికి లేకుండా పోయింది.

—రమ